www.pencounter.net

# పెన్ కౌంటర్

అవినీతి పై అక్షర సమరం..!


హైదరాబాద్
14-11-2025
వెల: రూ.5/-
పేజీలు: 4
సంపుటి:01
సంచిక: 131

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## త్వరలో లింబాద్రి గుట్ట, సిద్దుల గుట్ట వద్ద పర్యాటక గెస్ట్ హౌజ్



- నిజామాబాద్: గత ప్రభుత్వం వేలకోట్లు దండుకుంది
- ప్రజల ఆస్తులను ధ్వంసం చేసి డబ్బులు దోచుకెళ్లారు
- జిల్లాకు తొందరలోనే నిధులు, ఫ్యాక్టరీలు వస్తాయి
- బోధన్‌లో త్వరలో పామాయిల్ ఫ్యాక్టరీ




## విదేశీ ఉద్యోగుల కోసం కేంద్రం కొత్త మొబిలిటీ బిల్లు-2025

- భారత నిపుణులకు మెరుగైన అవకాశాలు, భద్రత కల్పించడం లక్ష్యం
- 1983 నాటి వలస చట్టం స్థానంలో నూతన నిబంధనలు
- వలసల స్థానంలో నైపుణ్యాలను ఎగుమతి చేసే సరికొత్త వ్యూహం

## ఆసుపత్రి ముందే భార్య దారుణ హత్య..

- చంపేసి పోలీసులకు ఫోన్ చేసిన భర్త!
- విజయవాడలో నర్సుగా పనిచేస్తున్న భార్య దారుణ హత్య
- ఆమె పనిచేస్తున్న ఆసుపత్రి వద్దే భర్త కిరాతక దాడి
- కత్తితో పొడిచి, గొంతు కోసి కిరాతకంగా చంపిన వైనం
- హత్య చేసిన అనంతరం పోలీసులకు ఫోన్ చేసి లొంగిపోయిన నిందితుడు
- ప్రేమ వివాహం తర్వాత మనస్పర్థలు.. కోర్టులో విడాకుల కేసు






# వేగమే వేదంగా పనిచేస్తున్నాం

- విశాఖ పెట్టుబడుల సదస్సుకు ముందే భారీగా ఒప్పందాలు
- ఒక్కరోజే రూ.3.65 లక్షల కోట్లకు పైగా విలువైన 35 ఎంఓయూలు
- గత ప్రభుత్వ హయాంలో వెళ్లిపోయిన కంపెనీల పునరాగమనం
- పెట్టుబడుల ఆకర్షణలో ఏపీని అగ్రస్థానంలో నిలుపుతామన్న సీఎం చంద్రబాబు
- ఒక్కరోజులో 15కి పైగా సమావేశాలకు హాజరైన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. విశాఖలో పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు ప్రారంభం కావడానికి ఒక రోజు ముందే రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారింది. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు 15కు పైగా సమావేశాల్లో పాల్గొని, సుడిగాలి పర్యటన చేశారు. తైవాన్, ఇటలీ రాయబారులతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో వరుస భేటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "పెట్టుబడుల సదస్సుకు ముందే ఈ స్థాయిలో స్పందన రావడం సంతోషకరం. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన ప్రతి పారిశ్రామికవేత్తకు

# ప్రపంచ పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానం హైదరాబాద్

- ఢిల్లీలో యూఎస్ఐఎస్‌పీఎఫ్ వార్షిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
- పరిశ్రమలకు పూర్తిగా అనువైన వాతావరణం.. భద్రతకు ఢోకా లేదు
- పెద్ద సంఖ్యలో యువత,సత్వర వృద్ధి రేటుతో తెలంగాణ
- గత 23 నెలల్లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు
- హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రాధాన్యం
- పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి
- తెలంగాణ రైజింగ్-2047 విజన్ ప్రదర్శించిన సీఎం



అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు పూర్తిగా అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్.. ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్య స్థానమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో తెలంగాణ రాష్ట్రం ఉందని తెలిపారు. ఢిల్లీలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం



# 'ఆపరేషన్ అరణ్య' హ్యాష్ ట్యాగ్ తో పవన్ కల్యాణ్

- 'ది వైల్డ్ ఈస్ట్' పుస్తకం ప్రస్తావన తెచ్చిన పవన్ కల్యాణ్
- శేషాచలం అడవుల్లో జరిగిన దోపిడీ వివరాలు నన్ను నివ్వెరపరిచాయని వెల్లడి
- అడవికి, ప్రకృతికి జరిగిన ద్రోహం తన మనసును కలిచివేసిందంటూ ట్వీట్

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. (ఆపరేషన్ అరణ్య) అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఆయన పెట్టిన పోస్ట్, ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడానికి సిద్ధమవుతోందనే బలమైన సంకేతాలను ఇస్తోంది. శేషాచలం, తూర్పు కనుమల్లో సహజ వనరుల దోపిడీపై ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

# నేడే బిహార్ తీర్పు

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- 38 జిల్లాల్లో 46 కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం
- విజయంపై రెండు కూటముల ధీమా




పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ఇవ్వబోయే తీర్పు కోసం దేశ ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. వారి నిరీక్షణ ముగిసే సమయం వచ్చేసింది. శుక్రవారమే ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. సీనియర్ నేత, అనుభవజ్ఞుడు నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారా? లేక యువ నాయకుడు తేజస్వీ యాదవ్ అధికార పీఠం అధిరోహిస్తారా? అనేది మరికొన్ని గంటల్లోనే తేలిపోనుంది. బిహార్ ప్రజలు ఎవరిని ఎన్నుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లూ చేసింది. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తయ్యింది. ఉదయం

2లో

# జూబ్లీహిల్స్ తీర్పు నేడే

ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ మధ్యాహ్నానికల్లా వెల్లడి!





# 32 చోట్ల మారణహోమానికి స్కెచ్

- అల్-ఫలాహ్ వర్సిటీ బాయ్స్ హాస్టల్ 13వ నంబర్ గదిలో పథక రచన
- గదిలో కీలక డైరీలు లభ్యం డైరీలో నవంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు మార్కింగ్

# ప్రపంచ పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానం హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో (యూఎస్ఐఎస్‌పీఎఫ్) సీఎం ప్రసంగించారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను ప్రదర్శించారు. 'తెలంగాణకు గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు, ప్రభుత్వాలకు సారథ్యం వహించాయి. అయితే.. పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారం. జీసీసీలకు గ్యమస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలిపేందుకే మా ప్రథమ ప్రాధాన్యత..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**చైనా ప్లస్ 1మోడల్‌కు గ్లోబల్ సమాధానంగా తెలంగాణ**

'గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుంది. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయ్, సియోల్ రివర్ ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కూడా కొత్త దశలోకి ప్రవేశిస్తుంది. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్%-%ఆర్ఆర్ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. చైనా ప్లస్1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుంది. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే.. తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుంది. ఈ దిశగా ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు దృష్టి సారించాలి..' అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# వేగమే వేదంగా పనిచేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ధన్యవాదాలు. రాష్ట్రాన్ని పెట్టుబడుల్లో నంబర్ 1 స్థానంలో నిలపడమే మా ధ్యేయం. వేగమే వేదంగా పనిచేస్తున్నాం" అని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరిస్తూ, "ఏపీకి వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం, పోర్టులు, మెరుగైన రోడ్డు, రైలు కనెక్టివిటీ ఉన్నాయి. దీంతో ఏపీ లాజిస్టిక్స్ రంగానికి కేంద్రంగా మారుతుంది. గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్, ఆక్వా కల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అపార అవకాశాలున్నాయి. ఆలోచనలతో వచ్చేవారికి అన్ని విధాలా అండగా ఉంటాం. 'ఒక కుటుంబం-ఒక వ్యాపారవేత్త' నినాదంతో ముందుకెళుతున్నాం. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో అనుమతుల్లో ఎలాంటి జాప్యం ఉండదు" అని చంద్రబాబు పారిశ్రామికవేత్తలకు భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ విధానాలు నచ్చక రాష్ట్రం విడిచి వెళ్లిన రెన్యూ పవర్ వంటి పలు ప్రముఖ సంస్థలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న పారిశ్రామిక అనుకూల వాతావరణానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు రోజుల సదస్సులో మొత్తం రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తుండగా, తొలిరోజే మూడో వంతుకు పైగా లక్ష్యం నెరవేరడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇదే కార్యక్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ల కోసం బాలాజీ యాక్షన్ బిల్డ్‌వేర్ సంస్థ రూ.1 కోటి విరాళం చెక్కును ముఖ్యమంత్రికి అందజేసింది.

# త్వరలో లింబాద్రి గుట్ట, సిద్దుల గుట్ట వద్ద పర్యాటక గెస్ట్ హౌజ్

తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సాధనలో సోనియా గాంధీ చేసిన పాత్రను గుర్తు చేసుకుంటూ, "సోనియా మహా దేవత లేకపోతే ఈరోజు తెలంగాణ వచ్చేది కాదు" అని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు దండుకుంది. ప్రజల ఆస్తులను ధ్వంసం చేసి, నేతలు డబ్బులు దోచుకెళ్లారు. అయితే, మేము చేసిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నాం. సుదర్శన్ రెడ్డి ప్రభుత్వం సలహాదారు కాదు, ఆయన జిల్లా నుంచి వచ్చిన మంత్రి. నిజామాబాద్ జిల్లాకు మెడికల్ కాలేజీ తెప్పించిన ఘనత ఆయనదే" అని అన్నారు. "త్వరలో లింబాద్రి గుట్ట, సిద్దుల గుట్ట వద్ద పర్యాటక గెస్ట్ హౌజ్ నిర్మించనున్నాం. బోధన్‌లో త్వరలో పామాయిల్ ఫ్యాక్టరీ కూడా స్థాపించబడనుంది. పనీ చేసే వారికి గుర్తింపు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం" అని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై బీజేపీ వైఖరిని విమర్శిస్తూ, "42% బీసీ రిజర్వేషన్ బిల్లు గురించి బీజేపీ ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, అర్వింద్ నోరు మెదపడం లేదు. దేవుడు పేరు మీద ఓట్లు అడిగే నేతలకు ప్రజలు భవిష్యత్‌లో తగిన బుద్ధి చెబుతారు" అని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# 'ఆపరేషన్ అరణ్య' హ్యాష్ ట్యాగ్ తో పవన్ కల్యాణ

కొంతకాలం క్రితం తాను 'ది వైల్డ్ ఈస్ట్' అనే పుస్తకాన్ని చదవడం ప్రారంభించానని, అందులోని వివరాలు తనను తీవ్రంగా ఆశ్చర్యపరిచాయని పవన్ కల్యాణ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. "వ్యవస్థ కళ్లెదుటే శేషాచలం, తూర్పు కనుమల్లోని ఎర్రచందనం, మన అమూల్యమైన సహజ సంపదను ఎలా దోచుకున్నారో ఈ పుస్తకం కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. రాజకీయం ముసుగులో దాక్కున్న కొందరు నేతలు పూర్తిస్థాయి మాఫియా డాన్లలా ఎలా వ్యవహరించారో ఇది బహిర్గతం చేస్తుంది" అని ఆయన వివరించారు. పుస్తకంలోని ఒక పాత్ర తనను ప్రత్యేకంగా ఆకట్టుకుందని పవన్ తెలిపారు. "ఓ చిన్నపాటి కాంట్రాక్టర్, అధికార దాహంతో ఎర్రచందనం స్మగ్లింగ్ సామ్రాజ్యానికి అధినేతగా ఎలా మారాడో రచయిత అద్భుతంగా చూపించారు. అది చదువుతుంటే కేవలం నేరాన్ని అర్థం చేసుకోవడమే కాదు.. మన నేల, అడవులు, ప్రకృతి, ప్రజలకు జరిగిన ద్రోహాన్ని అనుభూతి చెందవచ్చు" అని ఆయన వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఎర్రచందనం స్మగ్లింగ్ విచ్చలవిడిగా జరిగిందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, కూటమి ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించడం తెలిసిందే.

# జూబ్లీహిల్స్ తీర్పు నేడే

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు శుక్రవారం జరగనుంది. స్థానికులు ఇచ్చిన తీర్పు వెలువడనుండగా..అన్ని పార్టీలు, ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు..కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌తో పాటు బీజేపీకి కూడా ఇక్కడ గెలుపు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో పోలింగ్ శాతాన్ని బట్టి ఆయా ప్రాంతాలు, బూత్‌ల వారీగా తమకు పడిన ఓట్ల సంఖ్యపై అంచనాలు వేయడంలో పార్టీలు నిమగ్నమయ్యాయి. శు క్రవారం మధ్యాహ్నానికల్లా ఫలితం వెలువడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

**అంతంత మాత్రంగానే పోలింగ్**

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో..ఇంకా మూడేళ్ల సమయం ఉండగానే జూబ్లీహిల్స్ సీటుకు ఉప ఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ముఖ్యనేతలు, బీఆర్ఎస్ కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావు తదితరులు, బీజేపీ నుంచి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆధ్వర్యంలో బండి సంజయ్, ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు చురుగ్గా ప్రచారం చేశారు. ఉవ్వెత్తున సాగిన ప్రచారంతో ఓటింగ్ 55%-%60 శాతం నమోదవుతుందని భావించారు. కానీ



చివరకు 48.42 % మాత్రమే నమోదైంది. మొత్తం 407 పోలింగ్ బూత్‌లకు గాను 34 కేంద్రాల్లో 60 శాతానికి పైగా, 192 కేంద్రాల్లో 50 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. దీంతో ఆయా బూత్‌ల ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించనున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఉదయం 8 గంటలకే మొదలు**

పార్టీలు గెలుపోటములపై విశ్లేషణలతో పాటు, వివిధ పోలింగ్ బూత్‌లలో ఆయా వర్గాల వారీగా పోలైన ఓట్లు, పార్టీల వారీగా అనుకూల ప్రాంతాలు, తదితర అంశాల ఆధారంగా విజయావకాశాలను బేరీజు వేసుకుంటున్నాయి. ఉప ఎన్నిక త్రిముఖ పోరుగా సాగితే..అనూహ్య ఫలితాలు వెలువడే అవకాశాలున్నాయనే ప్రచారం తొలుత జరిగింది. అయితే క్షేత్రస్థాయి పరిస్థితులు, పోలింగ్ శాతం నమోదు, తదితరాలు గమనిస్తే మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం ఉందని రాజకీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు మొదలుపెడతారు. బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు నిలవడంతో అందుకు అనుగుణంగా కౌంటింగ్ టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు పది రౌండ్లలో ముగించనున్నారు. లెక్కించే ఓట్లను బట్టి ఎప్పటికప్పుడు ఫలితాలను ఈసీ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. 15 ప్లాటూన్లతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# 32 చోట్ల మారణహోమానికి స్కెచ్

న్యూఢిల్లీ: దశాబ్దాల క్రితం బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకారంగా, తాజాగా ఆపరేషన్ సిందూర్ వేళ పాకిస్తాన్‌లో జైషే మొహమ్మద్ కీలక నేతల మరణాలకు కక్షసాధింపుగా నిద్రాణ ముష్కరమూకలు తలపెట్టిన మారణకాండ గుట్టు రట్టవుతోంది. ఎర్రకోట వద్ద కారును పేల్చేసిన ఆత్మాహుతి బాంబర్ డాక్టర్ ఉమర్ ఉన్ నబీ హాస్టల్ గది వేదికగా పేలుళ్ల కుట్రకు ఉగ్రవాదులు పథక రచన చేశారని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఏఐ) అధికారులు గురువారం తేల్చారు. ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయంలోని బాయ్స్ హాస్టల్ 17వ భవంతిలోని 13వ నంబర్ గదిని ఉగ్రవాదులు తమ రహస్య అడ్డాగా ఉపయోగించుకున్నారు. ఇక్కడి నుంచే అన్ని చోట్లా దాడులకు వ్యూహం పన్నారు. 32 పాత, కొత్త కార్లలో బాంబులను అమర్చి దేశంలోని నాలుగు ప్రధాన నగరాలతోపాటు 32 ప్రాంతాల్లో పేల్చేసి పెను విధ్వంసం సృష్టించాలనేది ఉగ్రవాదుల అసలు కుట్ర అని స్పష్టమైంది. ఇప్పటికే అరెస్టయిన డాక్టర్ ముజామిల్‌కు, ఉమర్‌కు మధ్య చివర్లో విభేధాలు పొడచూపాయి. ఈ కారణంగానే దాడి ప్రాంతాలు మారాయా? దాడి చేయాల్సిన తేదీలు మారాయా? అనేది తేలాల్సి ఉంది. వర్సిటీ హాస్టల్‌లో ముజామిల్‌కు చెందిన 13వ నంబర్ గదితోపాటు ఉమర్ ఉండే నాలుగో నంబర్ గదిలో అధికారులు 3 డైరీలను స్వాధీనంచేసుకున్నారు. వీటిలో 25 మంది వ్యక్తుల పేర్లు ఉన్నాయి. వీరిలో చాలా మంది జమ్మూకశ్మీర్, ఫరీదాబాద్‌కు చెందిన వాళ్లే. కోడ్ భాషలో పలు ప్రాంతాల పేర్లు, కొన్ని నంబర్లు రాసి ఉన్నాయి. డైరీలో నవంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు మార్కింగ్ చేసి ఉంది. చాలా చోట్ల 'ఆపరేషన్' అని రాసి ఉంది. దీంతో ఇది ఎంతో పకడ్బందీగా జరిగిన విద్రోహచర్య అని అర్థమైంది. పాతిక మంది సాయంతో తమ ప్రణాళికను ఆచరణలో పెట్టాలని ఉమర్, ముజామిల్ భావించారని దర్యాప్తు అధికారులు తెలిపారు. ధౌజ్ గ్రామంలో 360 కేజీల అమ్మోనియం నైట్రేట్‌ను స్వాధీనంచేసుకున్న లాడ్జ్ వివరాలను ముజామిల్ డైరీలో అధికారులు గుర్తించారు.

# ఆసుపత్రి ముందే భార్య దారుణ హత్య..

విజయవాడ నగరంలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను ఓ భర్త అతి కిరాతకంగా హత్య చేశాడు. ఆమె పనిచేస్తున్న ఆసుపత్రి వద్దే మాటువేసి కత్తితో పొడిచి, గొంతు కోసి చంపాడు. అనంతరం తానే స్వయంగా పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి లొంగిపోయాడు. విజయవాడ సూర్యారావుపేటలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన మట్టకొయ్య సరస్వతి (30) విజయవాడలోని విన్స్ హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తున్నారు. కృష్ణా జిల్లా నాగాయలంకకు చెందిన విజయపాల విజయ్‌కు ఆమెతో పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. సుమారు మూడేళ్ల క్రితం వీరిద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. అయితే, కొంతకాలంగా విజయ్ తన భార్య సరస్వతిపై అనుమానం పెంచుకుని తరచూ గొడవపడి వేధించేవాడు. భర్త వేధింపులు భరించలేక ఆమె కుమారుడిని తీసుకుని నూజివీడులోని పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడి నుంచే రోజూ విధులకు హాజరవుతోంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు తీవ్రం కావడంతో విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం వీరి కేసు కోర్టులో విచారణ దశలో ఉంది. గురువారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సరస్వతి ఆసుపత్రి నుంచి బయటకు వచ్చింది. అప్పటికే అక్కడ కాపుకాచిన విజయ్, ఆమెను అడ్డగించి తన వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా పొడిచి, గొంతు కోశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. స్థానికులు అడ్డుకోవడానికి ప్రయత్నించగా, విజయ్ కత్తి చూపిస్తూ వారిని బెదిరించాడు. సరస్వతి చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత, అక్కడి నుంచే పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి భార్యను హత్య చేసినట్లు సమాచారం ఇచ్చాడు. వెంటనే సౌత్ ఏసీపీ పవన్ కుమార్, సీఐ ఆలీ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# విదేశీ ఉద్యోగుల కోసం కేంద్రం కొత్త మొబిలిటీ బిల్లు-2025




విదేశాల్లో పనిచేస్తున్న, పనిచేయడానికి వెళుతున్న భారతీయ కార్మికులు, నిపుణుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో వలసలపై వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో, భారత ఉద్యోగులకు మెరుగైన అవకాశాలు, భద్రత కల్పించడంతో పాటు, వారు తమ ఉద్యోగ కాలం ముగిశాక తిరిగి స్వదేశానికి వచ్చేలా ప్రోత్సహించేందుకు 'ఓవర్సీస్ మొబిలిటీ (ఫెసిలిటేషన్ అండ్ వెల్ఫేర్) బిల్లు, 2025'ను ప్రతిపాదించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది డిప్లొమాట్' కథనం ప్రకారం, ఈ కొత్త బిల్లు కేవలం వలస విధానంలో మార్పు కాదు, ఆర్థిక దౌత్యంలో కార్మిక శక్తిని ఒక మూలస్తంభంగా మార్చే ప్రయత్నం. ఇప్పటివరకు అమల్లో ఉన్న 1983 నాటి పాత వలస చట్టం స్థానంలో ఈ కొత్త బిల్లు సమగ్రమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకురానుంది. ఇది కేవలం విదేశీ ఉపాధిని సులభతరం చేయడమే కాకుండా, ఉద్యోగులు సురక్షితంగా తిరిగి రావడం, స్వదేశంలో వారి పునరేకీకరణకు కూడా భరోసా ఇస్తుంది. ఈ బిల్లు ద్వారా భారత ప్రభుత్వం తన కార్మికుల వలసలను కేవలం ప్రేక్షకపాత్రకే పరిమితం చేయకుండా, వారి ఉద్యోగ నిబంధనలపై ఇతర దేశాలతో చురుగ్గా చర్చలు జరుపుతోంది. 2014 నుంచి భారత కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూరప్, ఆసియా, గల్ఫ్ ప్రాంతాల్లోని దాదాపు 20 దేశాలతో కార్మిక మొబిలిటీ ఒప్పందాలు కుదుర్చుకుంది. "అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గి కార్మికుల కొరత ఏర్పడుతుంటే, భారత్ వంటి దేశాల్లో స్థిరమైన జనాభా ఉన్నా ఉద్యోగాల కొరత ఉంది. ఈ సమస్యకు శాశ్వత వలసలు పరిష్కారం కాదు, ఎందుకంటే దీనివల్ల రాజకీయ వ్యతిరేకత వస్తోంది. అందుకే, భారత్ తన నైపుణ్యాలను ఒక నిర్ణీత కాలపరిమితితో ఎగుమతి చేసే మార్గాన్ని ఎంచుకుంది" అని ఆ కథనం విశ్లేషించింది. భారత్ అతిపెద్ద ఆస్తి 25 ఏళ్లలోపు వయసున్న 60 కోట్లకు పైగా యువత కాగా, అభివృద్ధి చెందిన దేశాలు తీవ్రమైన కార్మికుల కొరతను ఎదుర్కొంటున్నాయి. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అధ్యయనం ప్రకారం, 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 4.5 నుంచి 5 కోట్ల మంది కార్మికుల కొరత ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో జర్మనీ, జపాన్ వంటి దేశాలు భారతీయ కార్మికుల కోసం చురుగ్గా ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే భారత్ కుదుర్చుకుంటున్న ఒప్పందాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఉదాహరణకు, భారత్-యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (%జజుూా%) ప్రకారం, యూకేలో తాత్కాలికంగా పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు అక్కడి సామాజిక భద్రతా చందాలు చెల్లించకుండా మూడేళ్లపాటు మినహాయింపు పొందారు. దీనివల్ల భారత కంపెనీలకు ఏటా సుమారు రూ.4,000 కోట్ల ఆదా అవుతుందని అంచనా. ప్రతిపాదిత కొత్త బిల్లు వివిధ దేశాల ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంచడానికి, అంతర్జాతీయ వలస ఒప్పందాలను పర్యవేక్షించడానికి, డేటా ఆధారిత విధానాలను రూపొందించడానికి దోహదపడుతుంది. అన్నింటికంటే ముఖ్యంగా, విదేశాలకు వెళ్లే భారతీయుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి, వారి హక్కులను కాపాడటానికి అవసరమైన వ్యవస్థలను ఇది బలోపేతం చేయనుంది.

# నేడే బిహార్ తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం కల్లా ఫలితాలపై స్పష్టత రానుంది. 38 జిల్లాల్లో మొత్తం 46 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను ఈసారి ఎన్నికల్లో ఏకంగా 2,616 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ నెల 6, 11న.. రెండు దశల్లో జరిగిన పోలింగ్‌లో రికార్డు స్థాయిలో 67.13 శాతం ఓటింగ్ నమోదయ్యింది. బిహార్ ఎన్నికల చరిత్రలో భారీగా ఓటింగ్ నమోదు కావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. కేంద్ర పరిశీలకులు, అభ్యర్థుల తరపు ఏజెంట్ల సమక్షంలో మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను వీడియోలో చిత్రీకరించనున్నట్లు ఎన్నికల సంఘం వర్గాలు వెల్లడించాయి. కౌంటింగ్ సెంటర్ల వద్ద రెండంచెల భద్రతను ఏర్పాటు చేశారు. నిరంతరం సీసీటీవీ కెమెరాల నిఘా ఉంటుంది.

బిహార్ ఎన్నికల్లో ప్రధానంగా ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ మధ్య పోటీ నెలకొంది. విజయం తమదేనని రెండు కూటములు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అత్యధిక శాతం ఓటింగ్ నమోదు కావడానికి సొంత భాష్యం చెబుతున్నాయి. తమ పాలన పట్ల ప్రజల్లో సానుకూలతకు ఇది నిదర్శనమని ఎన్డీయే వాదిస్తుండగా, నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న లక్ష్యంతోనే ఓటర్లు భారీగా తరలివచ్చి ఓట్లు వేశారని మహాగఠ్‌బంధన్ వర్గాలు తేల్చిచెబుతున్నాయి. రాష్ట్రంలో మరోసారి ఎన్డీయే అధికారంలోకి రావడం తథ్యమని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించాయి. మరోవైపు చివరి నిమిషంలో పార్టీలన్నీ ఫలితాల లెక్కల్లో మునిగితేలాయి. గురువారం చర్చోపచర్చలు సాగించాయి. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఆర్జేడీ అగ్రనేత, విపక్ష కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ విజ్ఞప్తిచేశారు. ఎవరైనా రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపులో అవాంఛనీయ ఘటనలు జరిగితే, అధికార కూటమిని అక్రమాలకు పాల్పడితే నేపాల్ తరహాలో బిహార్ ప్రజలు తిరుగుబాటు చేస్తారని ఆర్జేడీ నాయకుడు సుశీల్‌కుమార్ సింగ్ తేల్చిచెప్పారు. జనం ఈసారి మార్పు కోరుకున్నారని, తేజస్వీ యాదవ్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని తేల్చిచెప్పారు.

ఎన్నికల ఫలితంపై మహాగఠ్‌బంధన్ పెద్దలకు ఇప్పటికే స్పష్టత వచ్చేసిందని, వారంతా నిరాశలో మునిగిపోయి ఓటర్లను కించపరుస్తూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని బీజేపీ బిహార్ అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ విమర్శించారు. ఎన్డీయే జనరంజక పాలనకు మరోసారి పట్టం కట్టాలని ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారని స్పష్టంచేశారు. రెండు దశల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, ఓట్ల లెక్కింపు కూడా అదేవిధంగా సాగుతుందని తాము ఆశిస్తున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకొనేందుకు బిహార్ ప్రజలు కట్టబడి ఉన్నారని దిలీప్ జైస్వాల్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఎన్డీయే మళ్లీ విజయం సాధించి, నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అయితే సరికొత్త ఘనత సాధిస్తారు. బిహార్‌కు ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన మొదటి నాయకుడిగా రికార్డుకెక్కుతారు. మరోవైపు ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ సైతం ఈసారి పోటీకి దిగింది. ఉనికి చాటుకొనేందుకు బాగానే కష్టపడింది. ఆ పార్టీ పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదని, సున్నా నుంచి రెండు మూడు సీట్ల దాకా రావొచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.



## తన తోటి మిత్రులు తాటికొండ రమేష్ కు అండగా నిలిచిన పదవ తరగతి మిత్రులు

**మర్రిగూడ (పెన్ కౌంటర్):-** హైదరాబాదులో మెడికోవా ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్లో బ్రెయిన్ సమస్యతో 60 రోజులుగా చికిత్య 7 పొందుతున్న శివన్నగూడ గ్రామానికి చెందిన తాటికొండ రమేష్ కుమారుడు మనికేష్ కు 18 లక్షల రూపాయలు ఖర్చు అవడం వలన మనకు మనం వీలైనంత వరకు సాయం చేద్దాము అనుకోని రమేష్ క్లాస్ మెంట్స్ (2013. 14) బ్యాచ్ చెందిన క్లాస్మేట్స్ 72,000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు వీలైనంతవరకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

## నల్లగొండ జిల్లా పోలీస్ వినూత్న ప్రచారం, నీవాహనం వేగంగా వెళ్తుంది, నీజీవితం ఆగిపోతుంది అంటూ హోల్డింగ్ ఏర్పాటు




నల్లగొండ జిల్లా ప్రతినిధి (పెన్ కౌంటర్): చిట్యాల రోడ్డు ప్రమాదాల నివారణకై వినుత్ర కార్యక్రమం ప్రారంభించింది నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ, రోడ్డు ప్రమాదాల నివారణకు నలగొండ జిల్లా పోలీస్ శాఖ వినుత్ర కార్యక్రమం ద్వారా వాహన చోదలకు అవగాహన కల్పిస్తున్నారు, నేషనల్ హైవే 65 చిట్యాల మండలం, వెలిమినేడు వద్ద నీవాహనం వేగంగా వెళ్తుందని కానీ నీ జీవితం ఆగిపోతుందని నినాదం ద్వారా యాక్సిడెంట్ కి గురైన కారు నుచూపుతూ హోల్డింగ్ ఏర్పాటు చేసి వాహనచోదలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు, గురువారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హోల్డింగ్ ప్రాంతాన్ని సందర్శించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగిఉండాలని అన్నారు, వాహన చోదకులు అతివేగంతో ప్రయాణించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ, డ్రైవింగ్ చేయడం,రాంగ్ రూట్లో ప్రయాణించడం , మద్యం తాగి వాహనాలు నడపడం లాంటి అనేక తప్పిదాల వల్ల నిత్యం అనేక ప్రమాదాలకు గురై ఎంతోమంది క్షతగాత్రులు,మృతువాత పడుకున్నారని పేర్కొన్నారు, వాహనం చోదకులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ఇలాంటి హోల్డింగులు చూడడం వలన వేగ పరిమితి మించకుండా, సీట్ బెల్ట్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా ఉండుటకు అవగాహన కలిగి ఉంటారని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చునన్నారు, వాహన దారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ రోడ్డుపైన ఉన్నటువంటి సూచికలను గమనిస్తూ సురక్షితంగా గమ్యాన్ని చేయగలరని సూచించారు, జిల్లా పోలీస్ శాఖ తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలు గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రమాదాలు జరుగుటకు గల కారణాలు తెలుసుకొని వెంటనే తగు నియంత్రణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో, నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, చిట్యాల సిఐ నాగరాజు, చిట్యాల ఎస్ఐ, మధు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు,,,

## పోలీసుల నాకాబంది

మహాదేవపూర్ పెన్ కౌంటర్:మహాదేవపూర్ మండల కేంద్రంలో గురువారం పోలీసులు నాకాబంది నిర్వహించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామంలోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 26వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించారు. అనంతరం డిఎస్పి సూర్యనారాయణ మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.గుడుంబా,గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ వెంకటేశ్వర్లు, కాటారం సీఐ నాగార్జున రావు, మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్, పలిమేల ఎస్సై రమేష్, కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి, కాటారం ఎస్సై శ్రీనివాస్, మహా ముత్తారం ఎస్సై మహేందర్, కొయ్యూరు ఎస్సై నరేష్ టీజీఎస్పీ, సివిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.







# ధాన్యం కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

**ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని,,,**

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు, గురువారం ఆమె మునుగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు పరిశీలించారు..**



**నల్లగొండ జిల్లా ప్రతినిధి (పెన్ కౌంటర్):-** సహజ వ్యవసాయం ద్వారా కల్తీలేని ఆరోగ్యమైన ఆహారం లభిస్తుందని, రైతులు ఈ పద్ధతిని అవలంబిస్తే నాణ్యతతో పంటలు పండుతాయని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు, దీనిని దృష్టిలో ఉంచుకొని సహజ వ్యవసాయాన్నీ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు, గురువారం ఆమె మునుగోడు నియోజకవర్గంలోని కిష్టాపురం గ్రామంలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా యువరైతు జక్కుల వెంకటేష్ పండిస్తున్న సహజ పంటలను పరిశీలించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సహజ పంటలను ఏ విధంగా పండిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు,ఈ పంటల వలన లాభాలు, పంటలు ఏ విధంగా ఉన్నాయి ఈ పంటలు కావలసిన సహజ ఎరువులు వంటి వివరాలు అడిగారు, జీవామృతం జీవగణమృతం వాడమని వెంకటేష్ చెప్పారు, సహజ వ్యవసాయం ద్వారా రైతుల ఉత్పత్తి వ్యాయాలు తగ్గి, నాణ్యతమైన పంటలు, పర్యావరణానికి హామీ లేకుండా ఆరోగ్యమైన ఆహారం లభిస్తుందని జిల్లాల్లో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రైతులు ఈ ఆరోగ్యకరమైన పంటలను ఉత్పత్తి చేయగలుగుగుతారని అన్నారు, సహజ పద్ధతిలో సాగు చేయాలనాకున్న రైతులకు సాంకేతిక సాయం అందించాలని అధికారులకు సూచించారు, ఈ నెల 22న నల్లగొండ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉదయదిత్య భవన్ లో సహజ వ్యవసాయంపై విజయరామ సహజ వ్యవసాయ నిపుణుల అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు , రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఆర్డీవో శ్రీదేవి, జిల్లా అనంతరెడ్డి, ఏడి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు,,,

## ఖరీదైన కార్లలో రాత్రి సమయాలలో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసిన చింతపల్లి పోలీసులు

**వీరివద్ద నుండి లక్ష ఇరవై వేల రూపాయల నగదు మరియు 36 లక్షల విలువ గల 3 కార్లు సీజ్**

**గతంలో వీరు 30కి పైగా నేరాలలో నిందితులు.**

**చింతపల్లి పోలీస్ స్టేషన్ నుంచి మీడియాకు వివరాలు వెల్లడించిన దేవరకొండ ఎఎస్పి మౌనిక ఐపిఎస్**



**చింతపల్లి (పెన్ కౌంటర్):-** గత కొంత కాలంగా జిల్లా లో మేకలు మరియు గొర్రెలు దొంగతనం జరుగుతున్న నేపద్యంలో గౌరవ జిల్లా %ఞా% గారు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇట్టి దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తులపై నిఘా ఉంచి పట్టుబడాలని ఆదేశించగా తేదీ 13-11-2025 తెల్లవారుజామున సుమారు 04.00 గంటల ప్రాంతంలో చింతపల్లి పోలీస్ వారు చింతపల్లి %శ% రోడ్ వద్ద వాహన తనిఖీ చేపడుతున్న సమయంలో వారిని చూసి ఒక స్కార్పియో కారు %ఞా 37ద్గీ% 5666 వాహనం వారి నుండి తప్పించుకొని పోవడానికి ప్రయత్నించగా వెంటనే చింతపల్లి పోలీస్ వారు అట్టి వాహనాన్ని పట్టుబడించి అందులో (03) మగవారు, (02) మహిళా ఉన్నారు. వారిని మా వద్ద ఉన్న ఫింగర్ ప్రింట్ స్కానర్ తో చెక్ చేయగా వారిపై గతంలో మేకల దొంగతనం కేసులు ఉన్నట్టు తేలింది. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా వారి పేర్లు 1) అమ్మలూరి విజయ ప్రసాద్ 2) దాసర్ల వినోద్ కుమార్ 3) గుంజ కార్తీక్ ఏ చిన్న 4) సంపంగి శారద 5) అమ్మలూరి నందిని ఏ బేబీ వీరి పైన గతంలో నల్గొండ రూరల్ పిఎస్, కనగల్, చండూర్, విజయపురి, నార్కట్పల్లి, నల్గొండ 2 టౌన్, మర్రిగూడ, దేవరకొండ, శాలిగౌరారం, నాంపల్లి, మునుగోడు, చింతపల్లి పిఎస్ లలో మేకల దొంగతనాల నేరాలలో నిందితులు. వీరు గతంలో జైలుకు వెళ్ళినా బైలు పై వచ్చిన ప్రవర్తన మార్చుకోకుండా తిరిగి నేరాలు చేయాలనీ నిర్ణయించుకున్నారు. అనుకున్న ప్రకారంగా వీరికీ పరిచయం ఉన్న వారందరూ కలిసి గ్యాంగ్ లుగా ఏర్పడి ఎవరికీ అనుమానం రాకుండా ఖరీదైన కార్లలో వచ్చి పగటి పూట రెక్కి నిర్వహించి రాత్రి సమయాలలో ఖరీదైన కార్లలో వచ్చి మేకలను కార్లలో వేసుకొని మేకల దొంగతనాలకు పాల్పడుతుంటారు. పట్టుబడిన నేరస్థులు చెప్పిన వివరాల ప్రకారంగా చింతపల్లి, దేవరకొండ, గుడిపల్లి, కల్వకుర్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో మేకల దొంగతనాలకు పాల్పడినట్టు తెలిపారు. వీరు దొంగలించిన మేకలను సంతలలో గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసుకుంటారు. ఇట్టి నేరాలలో సంబంధించి నిందితుల నుండి లక్ష ఇరవై వేల రూపాయల నగదు మరియు 36 లక్షలు విలువచేసే మూడు ఖరీదైన కార్లను సీజ్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది.

**పట్టుబడిన నేరస్థుల వివరాలు:**

1) అమ్ములూరి విజయ్ తండ్రి: అమ్ములూరి స్వామి, వయస్సు: 25 సంవత్సరాలు, కులం: మాదిగ, వృత్తి: ఆటో డ్రైవర్, నివాసం: ఎస్సీ కాలనీ దైద గురజాల మండలం పల్నాడు జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

2) దాసర్ల వినోద్ కుమార్ ఏ కోటి తండ్రి: చంద్రయ్య, వయస్సు: 28 సంవత్సరాలు, వృత్తి: కూలి, నివాసం: నిడుమనూరు నల్లగొండ జిల్లా.

3) గుంజ కార్తీక్ తండ్రి గోపాల్ వయస్సు 20 సంవత్సరాలు కులం వడ్డెర వృత్తి చికెన్ షాప్ వర్కర్ నివాసం రాంనగర్ కాలనీ నిడమనూరు నల్లగొండ జిల్లా

4) సంపంగి శారద భర్త: వెంకన్న, వయస్సు: 40 సంవత్సరాలు, కులం: వడ్డెర, నివాసం: అలీనగర్, చెక్ పోస్ట్ 14%ష్ట్ర% మైలు రాయి అనుముల మండలం.

5) అమ్ములూరి నందిని ఏ బేబీ భర్త విజయ్ ప్రసాద్ వయస్సు 26 సంవత్సరాలు కులం వడ్డెర వృత్తి కూలీ నివాసం దయదా గ్రామం గురజాల మండలం పల్నాడు జిల్లా

7) సంపంగి వెంకటేష్

8) శబరిష్

(ఇట్టి దొంగల ముఠాలోని ఇద్దరు సభ్యులు సంపంగి వెంకటేష్ మరియు శబరిష్ పరారీలో ఉన్నారు). ఇట్టి ముఠా సభ్యులను దేవరకొండ ఎఎస్పీ గారిపర్యవేక్షంలో పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన నాంపల్లి సిఐ రాజు, చింతపల్లి ఎస్సై రామ్మూర్తి, చింతపల్లి సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సైదులు, కానిస్టేబుల్స్ చరణ్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, విజయ్ హోంగార్డులు శేఖర్ సిబ్బందిని జిల్లా ఎఫ్.పి. గారు ప్రత్యేకంగా అభినందించి దేవరకొండ ఏఎస్పీ గారు రివార్డును అందజేశారు.



# బాక్సాఫీస్ వార్ అన్నది మీడియా సృష్టి

## ఏ సినిమాకు ఏదీ పోటీ కాదన్న అడవి శేష్



బాక్సాఫీస్ వార్ అనేది మీడియా సృష్టించిన పదం అని నటుడు అడివి శేష్ తన అభిప్రాయపడ్డారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'డెకాయిట్' మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇదే తేదీన యశ్ నటిస్తోన్న 'టాక్సిక్' కూడా విడుదల కానుంది. దీంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ వార్ తప్పదని కామెంట్స్ వినిపిస్తున్నాయి. తాజాగా దీనిపై అడివిశేష్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. టాక్సిక్' సినిమాకు మేం భయపడడం లేదు. నేను ఎప్పుడూ సైలెంట్‌గా వచ్చి హిట్‌ను సొంతం చేసుకుంటాను. ప్రేక్షకులు కనీసం ఊహించని చోట వాళ్లను ఆశ్చర్యపరచడం నా అలవాటు. ఇక ఒకేసారి రెండు సినిమాలు విడుదలై హిట్‌లు సొంతం చేసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2018లో యశ్ నటించిన 'కేజీఎఫ్' షారుక్ 'జీరో' ఒకేసారి విడుదలయ్యాయి. రెండూ ఆదరణ సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు కూడా అంతే మా రెండు చిత్రాలు హిట్ అవుతాయని నాకు నమ్మకం ఉందన్నారు. రెండు సినిమాలు ఒకేరోజు ప్రేక్షకుల ముందుకు వస్తే వాటిలో ఒకటి ఫ్లాప్ అవుతుందనేది పూర్తిగా అసత్యం. ప్రేక్షకులే విజేతను నిర్ణయిస్తారు. 'లగాన్', 'గదర్: ఏక్ ప్రేమ్ కథ' ఒకేసారి వచ్చి రెండూ బ్లాక్‌బస్టర్ విజయాలను సొంతం చేసుకున్నాయి. బాక్సాఫీస్ వార్ అనేది మీడియా సృష్టించిన ఒక పదమంతే. దాన్ని ప్రేక్షకులు పట్టించుకోరు. కథ బాగుంటే అది ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పిస్తుంది. ఆ వారాంతంలో ఏదైనా పండగ వస్తే అప్పుడు మరింత సందడి నెలకొంటుందని అడివి శేష్ చెప్పారు.

# అఖండ-2పై ఆసక్తికర పోస్ట్

## మూవీలో శంకర్ మహదేవ్, కైలాశ్ ఖేర్ పాటలు

తెలుగుతోపాటు పాన్ ఇండియా ప్రేక్షకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి అఖండ 2. బాలకృష్ణ , బోయపాటి శీను కాంబోలో వస్తోన్న ఈ సీక్వెల్ ప్రాజెక్ట్ డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుందని తెలిసిందే. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ 2 టీజర్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. అఖండ ఫస్ట్ పార్ట్‌లో మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ బీజీఎం ఏ రేంజ్‌లో సినిమాకు హైలెట్‌గా నిలిచిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇక సీక్వెల్ ప్రాజెక్ట్‌లో అంతకుమించిన స్కోర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉండబోతుందని ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెబుతున్నాయి. కాగా మూవీ అండ్ మ్యూజిక్ లవర్స్‌కు థ్రిల్ అందించే అదిరిపోయే వార్త ఒకటి ఇప్పుడు ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న లెజెండరీ సింగర్స్‌లో టాప్‌లో ఉంటారు శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్. ఈ ఇద్దరు సింగర్స్ పాటలు దేశమంతా ఎక్కడో ఒకచోట మార్మోగుతుంటాయని తెలిసిందే. అఖండ 2 కోసం ఈ ఇద్దరు కలిసి పనిచేయబోతున్నారన్న వార్త హైప్ పెంచేస్తుంది. నవంబర్ 7న అఖండ 2 ఫస్ట్ సింగిల్ ప్రోమోను ప్రకటించనున్నారని తెలిసిందే. నవంబర్ 9న ఫుల్ ట్రాక్‌ను లాంచ్ చేయనున్నారు. ఈ పాటను శంకర్ మహదేవన్, కైలాశ్ ఖేర్ పాడినట్టు థమన్ ప్రకటించడంతో ఓ వైపు పాటతోపాటు మరో సినిమాపై కూడా అంచనాలు పెరిగిపోతున్నాయి. ఇక ఈ ఇద్దరి వాయిస్‌తో థియేటర్లలో స్పీకర్లు బద్దలు ఖాయమైపోయినట్టేనని అంటున్నారు సినీ జనాలు.










## 15న గ్రాండ్ ఈవెంట్ నిర్వహిస్తున్న రాజమౌళి

# 'ఎస్-ఎస్ఎంబి 29' మూవీపై వీడిన ఉత్కంఠ

ఇప్పుడు అంతటా మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తున్న'ఎస్-ఎస్ఎంబి 29' గురించే చర్చ. ఈ నెలలో సినిమాకు సంబంధించి పెద్ద అప్డేట్ ఇస్తా అని రాజమౌళి ప్రకటించిన నేపథ్యంలో కొన్ని రోజులుగా నెట్టింట ఈ సినిమా పై చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. అయితే సినిమా టైటిల్ వదులుతార లేక మహేష్ బాబు లుక్ రివీల్ చేస్తారా అని అభిమానులు ఆతురతగా ఎదురు చూస్తున్నారు. అయితే దీని కోసం రాజమౌళి పెద్ద ఈవెంట్ ప్లాన్ చేసారు. ఈ విషయాన్నీ అయన తనయుడు కార్తికేయ అధికారికంగా ప్రకటించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఈ నెల 15న ఈవెంట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ వీడియోను పోస్టు చేశారు. అలాగే ఈ సినిమా ఈవెంట్ ను 'జియో హాట్‌స్టార్' ఓటీటీ లో స్ట్రీమింగ్ కానుందంటూ వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో తన ట్వీట్‌కు ఓటీటీ సంస్థ ఖాతాను కార్తికేయ ట్యాగ్ చేయడంతో దీనిపై క్లారిటీ వచ్చింది. జియోహాట్ స్టార్ ఈ వీడియోను పోస్టు చేస్తూ ఇండియాలో 'ఎస్-ఎస్ఎంబి 29' ఈవెంట్ తమ ఓటీటీలోనే స్ట్రీమింగ్ అవుతుందని తెలిపింది.

# తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన కుంభమేళా మోనాలిసా



సోషల్ మీడియా వచ్చాక చాలామంది ఫేమస్ అవుతున్నారు. తమ టాలెంట్‌తో ముందుకు సాగుతున్నారు. . మహాకుంభమేళాలో దేవుడిని దర్శించుకొని రాకుండా కొంతమంది యూట్యూబర్స్ ఒక పూసలు అమ్మే అమ్మాయిని వీడియోలు తీసి సోషల్ మీడియా సెన్సేషన్ గా మార్చారు. ఆమె మోనాలిసా. కలువ రేకుల్లాంటి కళ్లు.. హీరోయిన్ ను మించిన అందం అంటూ మోనాలసాను ఆకాశానికి ఎత్తారు. ఇక ఆ వీడియోలు వైరల్ గా మారి మోనాలిసా సెలబ్రిటీగా మారడమే కాకుండా హీరోయిన్ గా కూడా ఛాన్స్ దక్కించుకుంది. ఇప్పటికే బాలీవుడ్ డైరెక్టర్ ఆమెను హీరోయిన్ గా చేస్తానని మాట ఇచ్చి తప్పిన విషయం తెల్సిందే. ఆ సినిమా మొదలు కాకముందే ఆగిపోయింది. ఇక ఇప్పుడు మోనాలిసా టాలీవుడ్ కు ఎంట్రీ కూడా ఎంట్రీ ఇచ్చింది. ఇటీవలే ఆమె నటిస్తున్న తొలి తెలుగు సినిమా పూజా కార్యక్రమాలతో మొదలయ్యింది. ఇట్స్ ఓకే గురు, క్రష్ లాంటి సినిమాలతో తెలుగుతెరకు పరిచయమైన హీరో సాయి చరణ్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం లైఫ్. శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను శ్రీ వెంగమాంబ మూవీస్ బ్యానర్ పై అంజయ్య విరిగినేని, ఉష విరిగినేనిలు నిర్మిస్తున్నారు. ఇక ఈ సినిమాలో సాయి చరణ్ సరసన మోనాలిసా హీరోయిన్ గా నటిస్తోంది. మంచి కథతో తెరకెక్కుతున్న చిత్రమని, పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ కు ప్లాన్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలోనే రిలీజ్ కు సిద్ధమవుతుందని తెలుస్తోంది. ఈ సినిమా కొద్దిగా పాజిటివ్ టాక్ తెచ్చుకున్నా మోనాలిసాను తెలుగులో ఆపడం ఎవరితరం కాదు. మరి ఈ పూసలు అమ్ముకొనే పిల్ల తెలుగు హీరోయిన్ గా సెట్ అవుతుందా లేదా అనేది చూడాలి.

# దుల్కర్ కాంత మూవీ ట్రైలర్ విడుదల

మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ , దగ్గుబాటి రానా మల్టీస్టారర్‌గా వస్తున్న చిత్రం 'కాంత'. ఈ సినిమాకు తమిళ దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నాడు. స్పిరిట్ మీడియా, వేఫేరర్ ఫిల్మ్స్ పతాకాలపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 1950 మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఊదిపడేయ డానికి నేను మట్టిని కాదు.. పర్వతాన్ని..' అంటూ దుల్కర్ చెప్పే డైలాగులు ఆకట్టుకుంటున్నాయి.

